కొండవాలు.. వానొస్తే దిగులు

● కానరాని రక్షణ చర్యలు ● విరిగిపడుతున్న మట్టిపెళ్లలు ● ఆందోళనలో ప్రజలు

కొండలపై రక్షణ గోడలు నిర్మించి ప్రజలకు రక్షణ ఇవ్వాల్సిన బాధ్యతను జీవీఎంసీ విస్మరించినట్టు కనిపిస్తోంది. కొండవాలు ప్రాంతాల్లోని పలుచోట్ల రిటైనింగ్ వాల్స్ (రక్షణ గోడల)ను నిర్మించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

రక్షణ గోడలు లేకే

ఆమోదించిన టెండర్లను ప్రస్తుత ప్రభుత్వం **రద్దు చేయడం, ఈ ప్రభు**త్వంలోనే జరిగిన **కౌన్సిల్ సమావేశంలో ఆమో**దించిన రిటైనింగ్ **వాల్స్ నిర్మాణ పనులకు** సంబంధించిన అంశాలు టెండర్ల దశకు వెళ్లకపోవడం దీన్ని స్పష్టం చేస్తోంది. ఫలితంగా వర్షాలు వచ్చినప్పుడు కొండప్రాంతాల్లోని జనం ప్రమాదాలకు గురవుతున్నారు. అయినప్పటికీ అధికారులు వీటికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని స్థానికులు వాపోతున్నారు.



గాజువాకలో కురుస్తున్న వర్షం

గాజువాక: కొండవాలు ప్రాంత ప్రజల్లో అలజడి మొదలైంది. వర్షాలకు నానిపోయి ఎప్పుడు ఏ గోడ కూలుతుందో.. ఎక్కడ కొండచరియ విరిగి పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు ఆయా ప్రాంతాల్లోని నివాసులు బిక్కుబిక్కుమంటున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం వెల్లదీస్తున్నారు. ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనతో కంటి మీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

ప్రమాదాలు.. ప్రాణ నష్టాలు

● గతంలో మట్టి పెళ్లలు జారి పడడంతో కొత్తగాజువాక పెట్రోల్ బంక్ ఎదురుగా కొండవాలులో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లోని రెండు ఫ్లాట్లు ధ్వంసమయ్యాయి. ఈ సంఘటనలో భార్యాభర్తలు గాయపడ్డారు.

● బీసీ రోడ్‌లోని సంజీవిగిరి కాలనీ కొండపై గతంలో ప్రమాదం చోటు చేసుకుంది. మట్టిపెళ్లలు విరిగి పడటంతో నివాసులు ఆందోళనకు గురయ్యారు. ఈ సంఘటనలో రెండిళ్లు ప్రమాదంలో పడ్డాయి.

● అంతకుముందు డ్రైవర్స్ కాలనీలో ప్రమాదం చోటు చేసుకుంది. రక్షణ గోడ కూలిపోవడంతో నివాసులు ఆందోళనకు గురయ్యారు.

● గాజువాక హైస్కూల్ రోడ్‌లోని పెంటయ్యనగర్‌లో మట్టిపెళ్లలు జారి పడడంతో పూరిల్లు ధ్వంసమైంది. ఆ ఇంట్లో యువతి గాయాలపాలైంది.

● గతంలో సింహగిరి కాలనీ కొండపై షెడ్డు కూలిపోవడంతో దంపతులు మృతి చెందారు. ఆ తర్వాత కూడా ఆ ప్రాంతంలో ఒక షెడ్డు కూలి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు.

● గాజువాక హైస్కూల్ రోడ్ కృష్ణానగర్‌లో కొండ చరియలు విరిగిపడి 2011లో ఇద్దరు చిన్నారులు మృతి చెందగా ఐదుగురు గాయపడ్డారు.

● ఆ పక్కనే ఉన్న బొజ్జన్న మట్టిపెళ్లలు విరిగి పడడంతో ఒక మహిళ దుర్మరణం పాలైంది.

● సుందరయ్య కాలనీలో ఇదే తరహా ప్రమాదంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.


● ఈ సంఘటనకు ముందు పెంటయ్యనగర్‌లో కొండ చరియలు విరిగి పడి ఇద్దరు కూలీలు, ఒక చిన్నారి మృత్యువాత పడ్డారు.

● శ్రీనగర్ కొండ భాగంలో ఓ ఇంటి నిర్మాణం కోసం పునాదులు తవ్వుతుండగా గోడ కూలి ఇద్దరు తాపీ మేస్త్రీలు మృతి చెందారు.

● రెండు వారాల కిందట కురిసిన భారీ వర్షాలకు చిట్టినాయుడు కాలనీలో ఒక ఇంటి రక్షణ గోడ కూలిపోయి ఇల్లు ప్రమాదంలో పడింది.

ఇదీ పరిస్థితి

గాజువాక పట్టణంలోని ఏడు వార్డుల పరిధిలో 12 కొండవాలు కాలనీలు ఉన్నాయి. 20వేల కుటుంబాలకు పైగా స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాయి. 65వ వార్డు భానోజీ కాలనీ, సంజీవిగిరి కాలనీ, 67వ వార్డు పెంటయ్యనగర్, కృష్ణానగర్, గణేష్ నగర్, బొజ్జన్నకొండ, 70వ వార్డు ఎల్‌బీఎస్‌నగర్, దశమికొండ, 71వ వార్డు శ్రీనగర్, సుందరయ్యకాలనీ, 73వ వార్డు సింహగిరి కాలనీ, 74వ వార్డు దయాళ్‌నగర్, పైడిమాంబ కాలనీ తదితర కాలనీలున్నాయి. తెరిపి లేకుండా వర్షాలు కురిసినప్పుడల్లా కొండలు నానిపోయి నివాసాలు కూలిపోతున్నాయి.



గాజువాకలోనికొండపై నివాసాలు



రెండు వారాల కిందట చిట్టినాయుడు కాలనీలో జారిపడ్డ మట్టిపెళ్లలు

చిట్టినాయుడు కాలనీలో దారుణం

చిట్టినాయుడు కాలనీ కొండవాలు ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మించకపోవడంవల్ల వర్షాలకు మట్టి జారిపోతోంది. దీంతో అక్కడి నివాసాలకు వెళ్లే దారిలో కూడా మట్టి చరియలు జారిపోతున్నాయి. దీంతో పిల్లలు కింద పడిపోయే ప్రమాదం ఏర్పడింది. ప్రమాదకరమైనప్పటికీ చెక్కలు ఏర్పాటు చేసుకొని నడిచి వెళ్తున్నారు. ఎల్‌బీఎస్ నగర్ కొండపై ఎస్సీ కాలనీకి వెళ్లే రహదారి కింద మట్టిచరియలు జారిపోయి రహదారి మొత్తం గాలిలో వేలాడుతోంది. ఈ పరిస్థితుల్లో అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి సహకరించాలని స్థానికులు కోరుతున్నారు.

శాఖల మధ్య సమన్వయ లోపం

కొండలపై నివాసం ఉన్నవారికి రక్షణ కల్పించే విషయంలో రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు సమన్వయంతో వ్యవహరించడం లేదన్న ఆరోపణలున్నాయి. కొండ ప్రాంతాల రక్షణ బాధ్యతను ఒకరిపై మరొకరు నెట్టేసుకుంటూ సమస్యను విస్మరిస్తున్నారని నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండలపై ఆక్రమణలు జరిగిపోతుంటే రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని జీవీఎంసీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. మున్సిపల్ అధికారులు సౌకర్యాలు కల్పిస్తుండడం వల్లే ఆక్రమణలు పెరిగిపోతున్నాయని రెవెన్యూ అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ రెండు వాదనల్లోనూ వాస్తవం ఉన్నప్పటికీ వారు ప్రజల రక్షణ బాధ్యతను విస్మరిస్తున్నారనే విమర్శలున్నాయి.

క్లుప్తంగా

సజ్జల దృష్టికి విశాఖ ఉక్కు సమస్యలు



సజ్జల రామకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రమణారెడ్డి

గాజువాక: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాలను ఉక్కు వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.వి.రమణారెడ్డి శుక్రవారం వైఎస్సార్‌సీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డికి వివరించారు. తాడేపల్లిలో ఆయన్ను కలిసి ఇక్కడి పరిణామాలపై వినతి పత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంతోపాటు ఈవోఐ ద్వారా 32 డిపార్టుమెంట్‌ల ప్రైవేటీకరణ, 4,800 మంది కాంట్రాక్టు కార్మికుల తొలగించిన విషయాన్ని సజ్జలకు వివరించారు. ఈ విషయాలను పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నాగిరెడ్డి, తదితరులు

పెదగంట్యాడ: నెల్లిముక్కు గ్రామ అధ్యక్షుడిగా, కార్మిక సంఘం నాయకుడిగా పులి అప్పలరెడ్డి చేసిన సేవలు మరువలేమని గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. పులి అప్పలరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం నెల్లిముక్కులో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సంతాప సభలో నాగిరెడ్డి పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, పులి రమణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, నాయకులు మంత్రి శంకరనారాయణ, బొడ్డ గోవింద్, కుటుంబ సభ్యులు పులి రామరెడ్డి, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీల్లో రూ. ఐదు కోట్లతో నిర్మించనున్న అభివృద్ధి పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. పెద్దినాయుడుపాలెం, దిబ్బపాలెం, దానబోయినపాలెం, బీసీకాలనీ, పినమడక, డొంకాడ, క్యాన్సర్ ఆస్పత్రి-ఫార్మాసిటీ నిర్వాసితకాలనీ రహదారి విస్తరణ, ఎదురివానిపాలెం, డొప్పవానిపాలెం, లేమర్తి, కొత్తపాలెం కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో 85,79 వార్డుల కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, రౌతు శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గాజువాక వైద్యుడికి స్వర్ణ పతకాలు



చక్రవర్తికి పతకాలు అందజేస్తున్న అతిథులు

గాజువాక: భూటాన్‌లో జరిగిన అంతర్జాతీయ పరుగు పందేల్లో గాజువాకకు చెందిన సీనియర్ ఫిజియోథెరపిస్టు స్వర్ణపతకాలు సాధించారు. ఇండో భూటాన్ ఇంటర్నేషనల్ గేమ్స్-2025 పేరుతో ఈనెల 8 నుంచి 11వరకు పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న గాజువాకకు చెందిన సీనియర్ ఫిజియోథెరపిస్టు డాక్టర్ ఆర్‌బీకే చక్రవర్తి మాస్టర్స్ 50+ విభాగంలో 5 కిలోమీటర్ల పరుగు, 800 మీటర్ల పరుగులో బంగారు పతకాలు సాధించగా, 400 మీటర్ల పరుగులో రజత పతకం సాధించారు. ప్రతిభ చాటిన ఆయన్ను పలువురు అభినందించారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

ముస్తాబవుతున్న త్రిశక్తి దేవాలయం

ఉక్కునగరం: మహాదుర్గ, మహాలక్ష్మి, మహాసరస్వతి ఒకే మండపంలో వెలిసిన ఉక్కునగరం త్రిశక్తి దేవాలయంలో ఈనెల 22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. అక్టోబర్ 02 వరకు వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈనెల 23న సహస్ర సంపెంగ పుష్పార్చన, 24న సహస్ర హస్త కంకణార్చన, 25న సహస్ర హరిద్ర ఖండార్చన నిర్వహించనున్నారు. 26న సహస్ర కమల పుష్పార్చన, 27న సహస్ర కలువ పుష్పార్చన, 28న స్త్రీలచే సామూహిక మణిద్వీప వర్ణార్చన (కలశపూజ), నవవిధ సహస్ర పుష్పార్చన, 29న సామూహిక అక్షరాభ్యాసాలు, సహస్ర శ్వేత కుసుమార్చన చేయనున్నారు. 30న సహస్ర గులాబీపుష్పార్చన, సాయంత్రం అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించనున్నారు. 1న ఉదయం సహస్ర ఫలార్చన, దసరా సందర్భంగా 2న ఉదయం వాహన పూజలు, సాయంత్రం నవచండీ యాగ మహా పూర్ణాహుతి, శమీ పూజలు నిర్వహించనున్నారు. తొమ్మిది రోజుల పాటు ముగ్గురు అమ్మవార్లను వివిధ వర్ణాల చీరలతో వివిధ రూపాల్లో అలంకరించనున్నారు. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని ఆయన ప్రధాన అర్చకుడు ఫణిశర్మ కోరారు.



త్రిశక్తి దేవాలయం

తెలుగుయువత అధ్యక్షుడిపై ఫిర్యాదు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు తెలుగు యువత అధ్యక్షుడు బి.చందుపై ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు పలువురు ఫిర్యాదు చేశారు. టిడ్కో ఇళ్లు కేటాయించేలా చేస్తానని చెప్పి ఇద్దరు బాధితుల నుంచి లక్ష వంతున వసూలు చేశారని, అలాగే కుళాయి కనెక్షన్ ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు తీసుకున్నాడని ఆరోపిస్తూ బాధితులు ఎమ్మెల్యేను తన కార్యాలయంలో కలిసి ఫిర్యాదు చేశారు. దివ్యాంగులు నుంచి కూడా డబ్బులు వసూలు చేయడం అన్యాయమని వారు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే డబ్బులు తిరిగి ఇచ్చేయాలని, టిడ్కో ఇళ్లు మంజూరు చేసేలా తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్టు బాధితులు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో పైడిరత్నం, పాముల వసంత్, రామకృష్ణ, దివ్యాంగుడు తలారి అప్పారావు, బలిరెడ్డి బాబూరావు దంపతులు, కరణం సన్యాసిరావు, పట్టా రామ అప్పారావు పాల్గొన్నారు.



తెలుగుయువత అధ్యక్షుడు చందూపై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన బాధితులు

జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలి

ఉక్కునగరం: ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు జనాభా ప్రాతిపదికన కేటాయించాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జె.వి. ప్రభాకర్ డిమాండ్ చేశారు. పాలకులు అలా చేయకుండా నిధులను పక్కదారి పట్టించడం దారుణమన్నారు. స్టీల్ సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐఏఎస్ స్టడీ సర్కిల్‌ను తక్షణమే తెరిపించాలన్నారు. డీఎస్సీ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయాలను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ విద్య, ఉద్యోగాల్లో సముచిత స్థానం లభించడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌లోని 47 విభాగాలను ఈవోఐ పేరిట ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. కేవీపీఎస్ గౌరవాధ్యక్షుడు వై.టి.దాస్, పుల్లారావు, డి.హెచ్.పిస్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్.రాజు, జి. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

వామ్మో... ఇదేమి రోడ్డు

అగనంపూడి: ఎస్టీబీఎల్, కాపు జగ్గరాజుపేట నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గం నామరూపాల్లేకుండా పోయింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రయాణికులకు ప్రాణ సంకటంగా మారింది. కాపు జగ్గరాజుపేట రైల్వే క్రాసింగ్ వంతెన నుంచి దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫారానికి అనుసంధానంగా ఉన్న ఈ మార్గాన్ని అటు జీవీఎంసీ ఇటు రైల్వే అథారిటీ పట్టించుకోపోవడంతో ఫీట్లు చేస్తూ పాట్లు పడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. గోతులు ఎక్కడ ఉన్నాయో గుర్తించలేక వాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. వర్షాలు పడితే రహదారి అంతా నీరునిలిచిపోతుంది. కిలోమీటన్నర ప్రయాణానికి పదిహేను నిమిషాల సమయం పడుతుందని ప్రయాణికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి కనీసం మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



నామరూపాల్లేని ఎస్టీబీఎల్, కాపు జగ్గరాజుపేట వెళ్లే మార్గం

మాజీ మున్సిపల్ చైర్మన్ రాజాకు ఘన నివాళులు

కూర్మన్నపాలెం: గాజువాక మాజీ మున్సిపల్ చైర్మన్ వీవీఎస్ఎం.రాజా ప్రథమ వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాజీ శాసనసభ్యుడు చింతలపూడి వెంకటరామయ్య,వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఉరుకూటి చందు, 86,87 వార్డులకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు భూపతిరాజుశ్రీనివాసరాజు, శ్రీనివాసపట్నాయక్, పి.శ్రీనివాస్, ఇల్లపు రాము, బొడ్డగోవింద్, దుగ్గపు దానప్పలు, దామోదర్, బుజ్జి ,సతీష్‌వర్మ తదితరులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజా చేసిన సేవలను కొనియాడారు.

టెన్త్ విద్యార్థులకు బయాలజీ మెటీరియల్ అందజేత



బయాలజీ మెటీరియల్‌తో విద్యార్థులు

పెదగంట్యాడ: మండలంలోని యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ బయాలజీ టీచర్స్ అసోసియేషన్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆ పాఠశాల బయాలజీ ఉపాధ్యాయురాలు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గడ్డం మేరీ సుజాత శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎస్.అప్పారావు, పాఠశాల కమిటీ చైర్మన్ మంగ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డులోని అక్రమ నిర్మాణాలను అధికారులు శుక్రవారం తొలగించారు. వార్డులోని లక్ష్మీపురం కాలనీలో ఉక్కుభూముల్లో యథేచ్ఛగా సాగుతున్న అక్రమనిర్మాణాలపై ఉన్నతాధికారులకు లెక్కకు మించి ఫిర్యాదులు అందడంతో ప్రణాళికా విభాగం ఎట్టకేలకు చర్యలకు ఉపక్రమించింది. దీనిలో భాగంగా గాజువాక జోన్ ప్రణాళికా విభాగం సిబ్బంది అక్కడికి చేరుకొని నిర్మాణంలో ఉన్న గోడలను కూలగొట్టారు. దీంతో కొంతకాలంగా కొనసాగుతున్న అక్రమాలకు కొంత మేర బ్రేక్ పడినట్టు అయ్యింది. కాలనీలో స్టీల్‌ప్లాంటుకు చెందిన స్థలాన్ని కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని కొంతమంది జిల్లా కలెక్టర్‌కు నేరుగా ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులను పరిగణలోకి తీసుకున్న అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు.

అవాంఛనీయ ఘటనలపై సమాచారం ఇవ్వండి

అగనంపూడి: రైళ్లలో ప్రయాణం చేసే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనల్లో పాల్గొవద్దని, అలాంటి సంఘటనలు చోటు చేసుకున్న సందర్భంలో 139 హెల్ప్‌లైన్ నంబర్‌కు సమాచారం అందివ్వాలని దువ్వాడ ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బుడుమూరు వెంకటరమణ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు రైళ్లపై రాళ్లు రువ్వడం, నడుస్తున్న రైలు నుంచి దిగడం, ఎక్కడం, మెట్ల వద్ద కూర్చోవడం, నిల్చొని ప్రయాణికులకు అసౌకర్యం కల్పించడం చేయరాదని విద్యార్థులకు సూచించారు. అలాగే పరిచయం లేని వ్యక్తులు ఎటువంటి ఆహార పదార్థాలు, పానీయాలు ఇచ్చినా తీసుకోవద్దన్నారు. తరువాత ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీఐ వెంకటరమణను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: స్థానిక కై లాసనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రెడ్డి జగన్నాథం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 22 నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయన్నారు. కనకదుర్గమ్మ రోజుకొక అలంకరణలో భక్తులు దర్శనమిస్తారని తెలిపారు. 30న ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు సంపత్ కుమార్‌శర్మ, ఆలయ కమిటీ ప్రతినిధులు కరణం వేణుగోపాల్, భాష్యం త్రినాథ్, కర్రి వెంకట సత్యనారాయణరెడ్డి, జి.శంకరరావు, కర్రి జగన్ మోహన్‌రావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

రాళ్లు తేలిన రోడ్లు

చిన్నపాటి వర్షాలకే బురదమయం



గుంతలు,రాళ్లు తేలపోయిన రాజీవ్‌నగర్ రహదారి

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం ప్రాంతంలో శుక్రవారం కురిసిన కొద్దిపాటి వర్షానికే పలు రహదారులు బురదమయంగా మారాయి. రాళ్లు తేలిన రోడ్లపై వర్షపు నీరు చేరడంతో మరింత అధ్వానంగా తయారయ్యాయి. ఫలితంగా వాహనచోదకులు, ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ప్రధానంగా జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్ ప్రాంతంలో రోడ్లన్నీ రాళ్లు తేలిపోవడం, గుంతలు ఏర్పడి బురదగా మారడంతో వాటిపై ప్రయాణం చేయడానికి నరకం చూస్తున్నారు. కొన్ని రహదారుల్లో అయితే నీరు నిల్వ ఉండి పోవడంతో దారి కనిపించక పడుతూలేస్తూ వాహనాలు నడుపుతున్నారు. కోళ్లఫారం రోడ్డులో గోతులకు తోడు మరోవైపు కాలువ తవ్వకాలు చేయడం వల్ల అటువైపు ప్రయాణం నరకంగా మారిపోయింది. అలాగే వడ్లపూడి ప్రధానరహదారి, కూర్మన్నపాలెం మెయిన్‌రోడ్డులో కూడా ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. దీంతో పెద్ద వాహనాలు వచ్చిపోయేటప్పుడు ఆ నీరు పాదచారులు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణం చేసేవారి తుళ్లి ఇబ్బంది పడ్డారు. దీంతో ఇంటి ముఖం పట్టి దుస్తులు మార్చుకోవాల్సివస్తుందని పలువురు వాపోయారు. చిన్నపాటి వర్షాలకే రహదారులు ఇలా తయారైతే భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటని ప్రజలు ప్రశ్ని స్తున్నారు.



బురదగా మారిన కోళ్లఫారం రోడ్డు

చిన్నపాటి వర్షానికే నిలిచిన నీరు



నెల్లిముక్కు పెంటమాంబ ఆలయం సమీపంలో



నడుపూరు వంతెన సమీపంలో..

పెదగంట్యాడ: మండలంలో శుక్రవారం కురిసిన చిన్నపాటి వర్షానికే పలు ప్రాంతాల్లో నీరు కాలువల్లోకి పోయే మార్గం లేకపోవడంతో రోడ్లపై నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు, పాదచారులకు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో నెలలు తరబడి కాలువలు శుభ్రం చేయకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా నీరు రోడ్డుపైకి చేరుతోంది. కాలువల్లో చెత్త, రోడ్ల పక్కన చెత్త కుప్పలతో దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు .ప్రజలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.అధికారులు స్పందించి నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.